క్లుప్తంగా

నైపుణ్య గణన సర్వేపై అపోహలు వద్దు



తాడేపల్లిరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నైపుణ్య గణన సర్వేపై అపోహలు వద్దని మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ కమిషనర్ అలీమ్ బాషా అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజల సాంకేతిక ఆర్థిక నేరాల నియంత్రణ దృష్ట్యా నైపుణ్య గణన సర్వే అప్లికేషన్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్ ఆప్షన్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వెసులుబాటులోకి తీసుకు రావడం జరిగిందని, నగర ప్రజలు స్వతహాగా తమ స్మార్ట్ ఫోన్‌లో ప్లే స్టోర్‌లో అప్లికేషన్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపై సిటిజన్ ఆప్షన్‌లో సెల్ఫ్ ఎన్యుమరేషన్‌పై క్లిక్ చేసి తద్వారా ఈ నైపుణ్య గణన సర్వేను అపోహలకు తావు లేకుండా తామే సర్వే పూర్తిచేసుకోవచ్చని వివరించారు. ఈ అప్లికేషన్ మరియు సర్వేపై సందేహ నివృత్తి కోసం దగ్గరలోని సచివాలయంలో సంప్రదించవచ్చని లేదా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి హెల్ప్ లైన్ 9988853335ను సంప్రదించవచ్చని కోరారు.

మాజీ సీఎంపై ఆరోపణలు అర్థరహితం

తాడేపల్లిరూరల్: వైఎస్సార్ సీపీ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ చేసిన ఆరోపణలు అర్థరహితం అని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని అన్నారు. బుధవారం దుగ్గిరాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆడపిల్లల కుటుంబాలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరామర్శించి భరోసా కల్పిస్తుంటే ఈ సమయంలో బాధ్యత కలిగిన ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా పనిచేసిన వాసిరెడ్డి పద్మ కూడా ఆ కుటుంబాలను పరామర్శించి ధైర్యం కల్పించాల్సింది పోయి విమర్శలు చేయడం తగదని చెప్పారు.

రైల్వే చైల్డ్ రైట్ యాక్ట్‌పై విద్యార్థులకు అవగాహన



మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల ఇంటెల్ పబ్లిక్ స్కూల్‌లో బుధవారం చైల్డ్ రైట్ యాక్ట్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో హైస్కూల్ ప్రిన్సిపాల్ కోనూరు రాణి విజయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు క్రమశిక్షణతో పాటు వ్యక్తిగత భద్రతపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రైల్వే చైల్డ్ ప్రొటెక్షన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 పై ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని కోరారు. పిల్లలకు వారికి ఉన్న హక్కుల గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, ప్రమాదం తలెత్తినప్పుడు స్పందించే విధానం గురించి వివరించారు. ఇలాంటి అవగాహన కార్యక్రమాల వలన మానసిక ధైర్యాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుందని చెప్పారు.

మహిళలపై దాడులు అరికట్టండి

సీఐటీయూ జిల్లా నాయకులు ప్రసాద్



తెనాలిఅర్బన్: రాష్ట్రంలో మహిళలపై దాడులు, అత్యాచారాలు, హత్యలు పెరిగిపోయాయని, వాటిని అరికట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్ డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ సీఐటీయూ తెనాలి శాఖ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయం నుంచి గాంధీచౌక్ వరకు నిరసన ర్యాలీని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై ప్రతిరోజు దాడులు జరుగుతున్న ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించటం బాధకరమన్నారు. ఇలాంటి ఘటనలలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అలాగే మహిళా భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవటంతో పాటు వారి రక్షణకు ప్రత్యేక చట్టాలు తేవాలన్నారు. తెనాలికి చెందిన సహాన మృగాల దాడుల్లో మృతి చెందటం బాధాకరమన్నారు. పేద దళిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలు స్వేచ్ఛగా రోడ్లపై తిరిగే పరిస్థితి రాష్ట్రంలో లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు దోషులపై ఎందుకు కఠినంగా వ్యవహరించటం లేదో ప్రజలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్‌వలి, నాయకులు జి.లావణ్య, పుష్ప, పావని, రత్నకుమారి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మునగకు ప్రోత్సాహం లేక..

- సంప్రదాయ విత్తనాలే దిక్కు..
- చెట్లు ఏపుగా పెరుగుతున్నా పూత నిలవక...
- కనిపించని ఉద్యాన శాఖ అధికారులు
- ఆందోళన చెందుతున్న 'మునగ' రైతులు

తాడేపల్లి రూరల్: ప్రస్తుతం మునగకు సాగుకు ప్రాధాన్యం పెరిగింది. పోషకాలు కలిగిన ఆకు కూరల్లో ఒకటిగా వైద్యులు సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పెరటిలోనే చెట్లు ఉండేవి. వాటి ప్రాధాన్యం గుర్తించిన రైతులు సాగుకు ఉపక్రమించారు. సాగు లాభదాయకంగా మలుసుకున్నారు.



రైతులు సాగు చేసిన మునగ తోట(ఫైల్)



పూర్వీకులు కాలం నుంచి నాటుతున్న మునగ విత్తనాలు

ఎక్కడెక్కడ సాగంటే..

నియోజకవర్గంలోని తాడేపల్లి, మంగళగిరి, తుళ్లూరు మండలాలలో మునగ సాగు చేపట్టారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా పంట పొలాల్లో వందల ఎకరాల్లో మునగ సాగు చేశారు. మునగ సాగు తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా గీసుకొండ ప్రాంతంలో కొద్దిమేర మునగ సాగు చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడ మునగసాగు చేస్తున్నా, ఇక్కడి రైతుల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాల్సిందే. దాదాపు నాలుగు వేల ఎకరాల్లో ప్రతి సంవత్సరం మునగ సాగు చేస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. మరో 15 రోజుల్లో సాగు చేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

సంప్రదాయక విత్తనాలే నేటికి..

ఎప్పుడో 50 సంవత్సరాల క్రితం నాడు తాత ముత్తాతలు కాలం నుంచి వాడుతున్న విత్తనాలనే ఈ ప్రాంతంలో రైతులు ప్రస్తుతం వాడుతున్నారు. అప్పట్లోనే తమిళనాడులోని కోయంబత్తూరు నుంచి తెచ్చిన మునగ విత్తనాలను వినియోగిస్తున్నారు. కాయ సైజును బట్టి ఒక కాయ 4-6 రూపాయల వరకు ధర పలుకుతుంది. రైతులకు అధిక ఆదాయం కురిపించే పంటగా మునగ సాగు ముందంజలో ఉంది.

తెగుళ్ల దాడి..

గత ఏడాది చెట్లు ఏపుగా పెరిగి పూత బాగా వచ్చింది. పూత కాస్తా పిందె దశకు వచ్చేసరికి రాలిపోవడమో, ఎండిపోవడమో జరిగింది. దీంతో రైతులు ఏం చేయాలో అర్థం కాక, పురుగుమందుల వ్యాపారస్తులు చెప్పిన ప్రతి మందు పిచికారి చేశారు. అయినా పూత నిలువలేదు. పంట చేతికి అందుతుందా! లేదా! అనే అర్థంగాని పరిస్థితిలో మునగ రైతులు భయాందోళన చెందారు. వ్యవసాయ శాఖ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రైతులు మాత్రం మునగ పంటను కాపాడుకోవడానికి ఎవరు ఏ సలహా ఇచ్చినా ఆ సలహాను అనుసరిస్తూ తమ జేబులు గుల్లచేసుకుంటున్నారు.

ఉద్యాన శాఖ నిర్లక్ష్యం..

రాజధాని ప్రాంతం కావడంతో వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు రావడం లేదు. తెగుళ్ల బారి నుంచి కాపాడే విత్తనాలు సరఫరా చేసేందుకు ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా జిల్లా ఉద్యాన శాఖ అధికారులు మంగళగిరి నియోజకవర్గంలో పండిస్తున్న మునగ పంటపై ప్రత్యేక శ్రద్ధ చూపించి తమను ఆదుకోవాలని రైతులు కోరుకుంటున్నారు.

ఎన్నో ఏళ్లుగా సాగు చేస్తున్నా...



గత ఏళ్ల నుంచి మునగ సాగు చేస్తున్నా. మా తాతలు, తండ్రులు వాడిన విత్తనాలనే ఇప్పటికీ వాడుతున్నాం. ప్రతి ఏడాది కాపు అయిన అనంతరం కొన్ని చెట్లను వదిలేసి ఆ విత్తనాలనే జాగ్రత్త చేసి మళ్లీ నాటతాం. రాను రాను దిగుబడి తగ్గుతోంది. అధికారులు ఎవరూ సలహాలు, సూచనలు ఇవ్వడం లేదు. అధికారులు మునగ సాగుపై ప్రత్యేక దృష్టి పెడితే దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉంది.

–బత్తుల శంకర్, ఉండవల్లి

వ్యవసాధికారులు శ్రద్ధ లేదు



మునగ పంట ఆందోళనకు గురి చేస్తోంది. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు సలహాలు అందిస్తే బాగుంటుంది. వ్యవసాయమే ప్రధాన జీవనోపాధిగా జీవిస్తున్న తమకు పంట చేతికి వచ్చే సమయానికి ఆందోళన ఎక్కువవుతోంది. మునగ పంట గురించి నూతన పద్ధతులపై అవగాహన కల్పించాలి. మునగ సాగు ప్రోత్సహించాలి.

–తమ్మా నాగిరెడ్డి, ఉండవల్లి

కంట కన్నీరు పెట్టిస్తోంది



ఎన్నో ఏళ్లుగా మునగ పంటను సాగుచేస్తున్నా. పూత దాటి పిందె దశకు చేరే సమయానికి ఎండిపోయిన పంట కంట కన్నీరు పెట్టిస్తోంది. ఏ అధికారి సూచనలు ఇవ్వకపోవడంతో ఎరువు అమ్మే వారి సలహాలే పాటించాల్సి వస్తోంది. ఉద్యాన శాఖ అధికారులు స్పందించి మా పంట పొలాల్లో పర్యటిస్తే మాకు కొండంత భరోసా కల్పించినవారవుతారు.

–మున్నంగి సాంబిరెడ్డి

128 మందికి వైద్య పరీక్షలు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని హెల్త్ వెల్‌నెస్ సెంటర్లో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా వైద్యశిబిరం నిర్వహించారు. 128 మంది రోగులకు బీపీ, షుగర్, థైరాయిడ్, రక్త పరీక్షలు చేసి నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈసందర్భంగా వైద్యురాలు శాంతి మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వర్షాకాలం కావడంతో వానలో తడవకుండా ఉండాలని, వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అమృత, ఏఎన్ఎం లావణ్య పాల్గొన్నారు.

ఆధార్‌లో మార్పులు చేర్పులు



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మార్నింగ్ స్టార్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలో బుధవారం 120 మందికి మార్పులు చేసినట్లు సిబ్బంది తెలిపారు. బయోమెట్రిక్ అప్‌డేట్, ఫోను నంబర్లతో ఆధార్‌కు లింకు, జనన ధ్రువీకరణ, అడ్రస్‌లో మార్పులు, పేర్లు మార్పులు వంటి వాటిగురించి ప్రజలు వచ్చి అప్లికేషన్లు అందజేశారన్నారు.

అయ్యప్పలకు అన్నదానం

ఫిరంగిపురం: మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని కొండపై కొలువై ఉన్న అయ్యప్ప స్వామి ఆలయం వద్ద బుధవారం అన్నదానం నిర్వహించారు. అయ్యప్పస్వామికి గురుస్వామి బాబు విశేష పూజలు, పంచామృతాలతో అర్చనలు చేశారు. అనంతరం మాలధారణ చేసిన అయ్యప్ప స్వాములకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా బాబుస్వామి మాట్లాడుతూ 26 ఏళ్లుగా మాలధారులైన అయ్యప్పలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గడిచిన పది రోజులుగా అన్నదానం ప్రారంభమై డిసెంబర్ 27 వరకు నిరంతరం అన్నదానం చేస్తామన్నారు. ప్రతిరోజు 700 మందికి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరిగేలా కృషి

డీఎంహెచ్ఓ విజయలక్ష్మి

ఫిరంగిపురం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సుఖ ప్రసవాలు జరిగేలా ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి విజయలక్ష్మి సూచించారు. మండల కేంద్రంలోని ఫిరంగిపురం పీహెచ్‌సీ, నుదురుపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బుధవారం ఆమె పరిశీలించారు. ఓపీ రిజిస్టర్లు, ఈహెచ్ఆర్ రిజిస్టార్లను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏఎన్‌సీ, పీఎన్‌సీ(గర్భిణుల, బాలింత)లకు సంబంధించి ఆర్‌సీ హెచ్ పోర్టల్‌లో నమోదు చేసినప్పటి నుంచి వారికి డాక్టర్ అనిత ఫోన్‌ద్వారా ఆరోగ్యసంబంధ విషయాలు ప్రతినెలా వివరిస్తారని చెప్పారు. ఏ నెలలో ఏ సేవలు అందేది తెలియజేస్తారన్నారు. మొత్తం మీద వారికి 76 సార్లు ఫోన్లు వస్తాయని వివరించారు. హైరిస్కు ఉన్న గర్భిణులకు సంబంధించి వారిని ట్యాగ్ చేసి సమాచారాన్ని సంబంధిత సూపర్‌వైజర్లు పరిశీలించాలని సూచించారు. వారిని ఏ వైద్యశాలకు ట్యాగ్ చేశారో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రసవానికి మూడు రోజుల ముందుగా వైద్యశాలలో చేర్పించాలని తెలిపారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి విజయలక్ష్మి

బిల్డింగ్ కేటాయించేందుకు కృషి

ఫిరంగిపురంలోని హెల్త్‌సెంటర్‌లో నిర్వహిస్తున్న పీహెచ్‌సీని ఆమె పరిశీలించారు. ఇటీవల 'సాక్షి'లో వచ్చిన తప్పని ప్రాథమిక ఇబ్బందుల శీర్షికకు ఆమె స్పందించారు. స్థలం ఉన్నా బిల్డింగ్ నిర్మాణం ప్రారంభం కాకపోవడంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్లు చెప్పారు. అప్పటి వరకు ప్రయివేట్ బిల్డింగ్‌లో ఆరోగ్యకేంద్రం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని వైద్యాధికారికి సూచించారు. ఆమె వెంట డాక్టర్ యానీగ్రేస్, శ్వేత, శాంతి, సీహెచ్‌వోలు వెంకటరమణ, వెంకటలక్ష్మి ఉన్నారు.

పత్తిలో వేరుకుళ్లు, ఆకుమచ్చ తెగులు ఉధృతి

మంగళగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి

పెదపరిమి(తాడికొండ): ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో పత్తిలో వేరుకుళ్ల తెగులు, ఆకుమచ్చ తెగుళ్లు గుర్తించడం జరిగిందని దీనిపై రైతులు అప్రమత్తంగా ఉండి వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకు మందులు పిచికారీ చేయాలని మంగళగిరి వ్యవసాయ సహాయ సంచాలకులు జి.శ్రీనివాసరెడ్డి సూచించారు. తుళ్లూరు మండలం పెదపరిమిలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. జిల్లా వనరుల కేంద్రం గుంటూరు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లాం వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు ఎస్.మనోజ్, వెంకటలక్ష్మి, రాజేష్ చౌదరి పాల్గొని పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో పంటను ఆశిస్తున్న వేరుకుళ్ల ఆకుమచ్చ తెగులు ఉధృతిని తగ్గించేందుకు సాఫ్ 3గ్రా/లీటరు నీటికి, కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3గ్రా/లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని కోరారు. బోరాన్ లోపం కనిపిస్తున్నందున బోరాక్స్ 1గ్రా/లీటరు నీటికి 3-4 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తుళ్లూరు మండల వ్యవసాయాధికారిణి కె.శ్రీరంజని పాల్గొన్నారు.



రైతులకు వివరిస్తున్న మంగళగిరి వ్యవసాయ సంచాలకులు, లాంఫాం శాస్త్రవేత్తలు

వేప కషాయంతో పంటకు రక్షణ

ఫిరంగిపురం: పత్తి పంటను ఆశించే గులాబీ రంగు ఉధృతి తగ్గేందుకు వేప కషాయాన్ని మొక్కలపై పిచికారి చేయాలని సీనియర్ శాస్త్రవేత్త ఎం.వెంకట్ రాములు అన్నారు. మండలంలోని రేపూడి, నుదురుపాడుల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకట్ రాములు రైతులకు పత్తి పంటను ఆశించే గులాబీ రంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఎకరాకు ఎనిమిది వరకు పెట్టాలన్నారు. కాండంపై నున్న గుడ్లు నిర్మూలనకు వేప కషాయం పిచికారి చేయాలని సూచించారు. వరి పైరుకు ఆకుచుట్ట పురుగు ఆశిస్తుందని దాని నివారణకు కార్టా హైడ్రోక్లోరైడ్ మందును 350 గ్రాములు నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు సుభాని, ధర్మదర్శ, సిబ్బంది కిరణ్ హకీమ్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఐ టీడీపీ పేరుతో మోసాలు

–వాటిని ఎవరూ నమ్మవద్దు
–మంత్రి నారా లోకేష్



తాడేపల్లిరూరల్: నా పేరు, ఫొటో వాడుకుని ఎన్ఆర్ఐ టీడీపీ పేరుతో కొందరు మోసాలకు పాల్పడుతున్నారని, అలాంటి ప్రకటనలు నమ్మవద్దని మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ బుధవారం సామాజిక మాధ్యమాల్లో ఒక పోస్టును విడుదల చేశారు. ఈ మేరకు ఆయన వివరాలను ఎక్స్ ద్వారా వెల్లడించారు. మోసగాళ్లను బ్లాక్ చేయాలని ఆయన సూచించారు. నారా లోకేష్ టీమ్ సభ్యులు సమస్యకు సంబంధించిన వివరాలు మాత్రమే అడుగుతారని, డబ్బులు అడిగినా ప్రజలు ఎవరూ ఇవ్వవద్దని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



అంతా అడ్డదిడ్డమే..

అది అసలే ఇరుకు రోడ్డు... నాలుగు నియోజకవర్గాలకు సంబంధించిన ప్రజలు విజయవాడ వెళ్లాలంటే ఈ రోడ్డు మార్గం నుంచే ప్రయాణం చేస్తారు. మంగళగిరి రూరల్ రేవేంద్రపాడు నుంచి తాడేపల్లి పట్టణ పరిధి వరకు ఈ రోడ్డు నిర్మించారు. ఈ రోడ్డు రేవేంద్రపాడు నుంచి వడ్డేశ్వరం కేఎల్‌యూ వరకు సింగిల్ రోడ్డు, అక్కడి నుంచి డబుల్ రోడ్. కేఎల్‌యూ వద్ద సింగిల్ రోడ్ ప్రారంభం అయ్యే దగ్గర కేఎల్‌యూలో చదివే విద్యార్థులు తమ బైక్‌లను రోడ్డుపై పార్కింగ్ చేసి వెళ్తుండడంతో తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు ఎలోగాలో వెళుతున్నారు కానీ ఒకేసారి రెండు ఆటోలు గానీ, లేదా ఆటో లారీ కానీ వస్తే ఇబ్బందికరంగా ఉంది.

–తాడేపల్లిరూరల్

డాక్టర్ అఖిలేష్ గుప్తాకు కేఎల్‌యూ విజనరీ అవార్డు

తాడేపల్లిరూరల్: యూజీసీ మాజీ కార్యదర్శి, సెర్ఫ్ సలహాదారు డాక్టర్ అఖిలేష్ గుప్తాకు ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ విజనరీ అవార్డును బుధవారం ప్రో వీసీ డాక్టర్ రాజశేఖర్, ప్రో చాన్సలర్ డాక్టర కేఎస్ జగన్నాధరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు ప్రదానం చేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా సైన్స్ పరంగా, సామాజికంగా, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సేవలందించిన అఖిలేష్ గుప్తాకు విజనరీ అవార్డును అందజేయడం ఆనందంగా ఉందని చెప్పారు. 40 ఏళ్లుగా సైన్స్‌ను అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. గతంలో యూజీసీకి కార్యదర్శిగా సేవలందించారని, ప్రస్తుతం సైన్స్ అండ్ ఇంజినీరింగ్ రీసెర్చ్ బోర్డు(సెర్ఫ్)కు సలహాదారులుగా పనిచేస్తున్నారని తెలిపారు. అవార్డు గ్రహీత అఖిలేష్ గుప్తా మాట్లాడుతూ దేశంలో నూతన ఆవిష్కరణలపై ఇంకా విశేష పరిశోధనలు జరగాలని అన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో చాన్సలర్ డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుబ్రహ్మణ్యం, అదనపు డీన్ అండ్ ఆర్ డీ డాక్టర్ బి.టి.పి.మాధవ్, ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ వి.శ్రీకాంత్, అదనపు ఫ్యాకల్టీ డీన్ డాక్టర్ పి.వి.చలపతి పాల్గొన్నారు.



డాక్టర్ అఖిలేష్ గుప్తాకు అవార్డును అందజేస్తున్న కెఎల్‌యూ ప్రో వీసీ డాక్టర్ రాజశేఖర్

సాయిబాబా మరణం ప్రజాస్వామ్యం చేసిన హత్య

సంస్మరణ సభలో విరసం రాష్ట్ర కార్యదర్శి అరసవల్లి కృష్ణ

తెనాలి: ప్రజాపోరాటాలకు నాయకత్వం వహించి, ఆదివాసీల విముక్తికి కృషిచేసిన ప్రొఫెసర్ జీఎస్ సాయిబాబా మరణం, ప్రజాస్వామ్యం చేసిన హత్యగా విరసం రాష్ట్ర కార్యదర్శి అరసవల్లి కృష్ణ ఆరోపించారు. ఇందుకు ప్రతిగా ఉపా చట్టం కింద జైళ్లలో మగ్గుతున్న వేలాదిమంది విడుదల డిమాండ్‌తో ముందుకు రావాలని ప్రజాస్వామ్యవాదులకు సూచించారు. ప్రజాసంఘాల ఐక్యవేదిక, భారత్ బచావో, భిన్నస్వరాలు-తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో ప్రొఫెసర్ సాయిబాబా సంస్మరణ సభకు 'అరసం' కార్యదర్శి కనపర్తి బెన్‌హర్ అధ్యక్షత వహించారు. అరసవల్లి కృష్ణ తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ, దేశంలో చట్టాల తీవ్రత, బూటకపు ప్రజాస్వామ్యపు ఆధిపత్యం ఏదిశలో కొనసాగుతుందోనని చెప్పేందుకు సాయిబాబా ఉదాహరణగా చెప్పారు. రాజకీయ విశ్వాసాలకు లోబడి పనిచేయటమే నేరంగా పాలకవర్గాలు పదేళ్ల పాటు ఆయన్ను జైలుపాలు చేశాయని చెప్పారు.



మాట్లాడుతున్న అరసవిల్లి కృష్ణ, వేదికపై రవిచంద్ర, బెన్‌హర్, విద్యాసాగర్

నిర్బంధ వ్యతిరేక వేదిక రాష్ట్ర నాయకుడు కె.రవిచంద్ర తన ప్రసంగంలో దేశంలోని గతంలోని ఎమర్జన్సీని మించిన అప్రకటిత ఎమర్జన్సీ నడుస్తోందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన వ్యవస్థలు ప్రశ్నించే గొంతుకలను అణచివేస్తున్నాయని అన్నారు. మావోయిస్టు ఆరోపణలతో ఆరువేల ఆది వాసీలు, ఉపా చట్టం కింద వందలాది మంది, నార్త్ ఈస్ట్, జమ్ముకశ్మీర్ ఉద్యమాల్లోని వారు ఎందరో జైళ్లలో మగ్గుతున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితి స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేదన్నారు. ప్రశ్నించే సాయిబాబా గొంతును అణచివేశామని అనుకున్నా, ఆయన జీవితం భావి తరాలకు పాఠం కాబోతోందని రవిచంద్ర అన్నారు.

వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ, ప్రొఫెసర్ సాయిబాబా కేసులో మలుపులను చూశాక దేశంలో రాజ్యాంగం ఉందా? కోర్టు లు పరిగణిస్తున్నాయా? అనే అనుమానం కలుగు తోందన్నారు. కులనిర్మూలన పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ తన ప్రసంగంలో, సాయిబాబా మరణం, మనం ఏవైపో తేల్చుకోవాల్సిన కర్తవ్యాన్ని నిర్దేశించిందని చెప్పారు.

ఆదివాసీల వైపా, వారి కాళ్లకింద భూమిలో గల ఖనిజ నిక్షేపాలను సామ్రాజ్యవాద శక్తులకు కట్టబెట్టాలని చూసే పాలకవర్గాల వైపా? మనమే తేల్చుకోవాలన్నారు. ప్రజాసాహితి సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు మాట్లాడుతూ, అణచివేతలకు వ్యతిరేకంగా ప్రజాఉద్యమం రావాల్సి ఉన్నా, ఆ పరిస్థితి కనిపించటం లేదన్నారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, న్యాయవాది జీఎస్ నాగేశ్వరరావు, సీపీఎం నాయకుడు కొల్లిపర బాబూ ప్రసాద్, ఏపీటీఎఫ్ నాయకుడు సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఉమారాజశేఖర్, చావలి గోపాల్ పర్యవేక్షించారు.

మార్పులకు అనుగుణంగా నడుచుకోండి



తెనాలిఅర్బన్: విద్యా విధానంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నడుచుకోవాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కోన శశధర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయం నుంచి వెబెక్స్ (వీడియో కాన్ఫరెన్స్)ను నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో తెనాలి పరిధిలోని ఎంఈవోలు మేకల లక్ష్మీనారాయ, వి.జయంతి బాబు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. స్కూల్స్ కాంప్లెక్స్‌ల రీ అర్గనైజేషన్, అపార్, పేరెంట్-టీచర్స్ కమిటీల సమావేశాలు తదితర అంశాలపై ఆయన సూచనలు చేసినట్లు ఎంఈవోలు తెలిపారు.